క్లుప్తంగా

ఉపాధి పనులు పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఏపీవో గంగాధర్

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ పథకం కింద పంట పొలాలకు వెళ్లేందుకు చేపడుతున్న పనులను ఈజీఎస్ ఏపీవో గంగాధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. వంద రోజులు పూర్తి కాని కూలీలు ఉపాధి పనులకు వెళ్లేలా చూడాలన్నారు. పని ప్రదేశంలో కొలతలను ఎప్పటికప్పుడు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

లక్ష్మణచాంద: సాధారణ మరమ్మతుల్లో భాగంగా మండలంలోని పీచర, మల్లాపూర్, పార్‌పెల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కృష్ణయ్యను కలిసిన ఎమ్మెల్యే



కృష్ణయ్యతో ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సామాజిక అంశాలపై చర్చించారు. బీసీల అభ్యున్నతి కోసం కృష్ణయ్య చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు.

పన్నులు వసూలు చేయాలి

లోకేశ్వరం: గ్రామాల్లో ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయాలని ఎంపీడీవో సోలమాన్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏపీవో జగన్నాథ్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెంలో ఈవీఎంలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈవీఎం, వీవీ ప్యాట్ పనితీరు, తదితర అంశాల గురించి రెవెన్యూ సిబ్బంది వివరించారు. ఉపాధ్యాయుడు సాయికిరణ్, సిబ్బంది దామెర రాజు, తదితరులు ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ



పీచరలో మాట్లాడుతున్న మధుసూదన్

లక్ష్మణచాంద: మండలంలోని ధర్మారం ప్రాథమికోన్నత పాఠశాల, పీచరలోని ప్రాథమిక, జెడ్పీ సెకండరీ పాఠశాలలను శుక్రవారం ఎంఈవో మధుసూదన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. పీచరలో ప్రీ ఫైనల్ పరీక్షలు రాస్తున్న పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వెనుకబడ్డ వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత హస్తమేళా ప్రారంభం

నిర్మల్‌టౌన్: చేనేత హస్తకళలకు అందరం చేయూతనిద్దామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ఎంఎస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శన, అమ్మకం సముదాయాన్ని చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాతో సన్మానించారు.

వీవోఏల సంఘం ఎన్నిక

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మండల సమాఖ్య సంఘ భవనంలో వీవోఏల సంఘం మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీవోఏల సంఘం మండలాధ్యక్షురాలిగా శనిగారపు సంగీత, ఉపాధ్యక్షురాలిగా పీసర శిరీష, కార్యదర్శిగా చిన్నోల్ల గంగాధర్, కోశాధికారిగా గైని శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఏపీఎం మల్లేశ్, సీసీలు ఉన్నారు.

వేసవిలో పశువుల గోస

- గ్రామాల్లో దాహం తీర్చని నీటితొట్లు
- తాగునీటికి తండ్లాడుతున్న మూగజీవాలు
- పట్టించుకోని అధికారులు



అల్లిలో పగుళ్లు తేలిన పశువుల నీటి తొట్టి



రాయపూర్‌కాండ్లీలో నిరుపయోగంగా నీటి తొట్టి

లోకేశ్వరం: వేసవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో నీటితొట్టిలు నిర్మించిన విషయం తెలిసిందే. నీటి సౌకర్యం కల్గిన ట్యాంకులు, ప్రజా కుళాయిల వద్ద వీటిని నిర్మించారు. కానీ సంబంధిత అధికారులు వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరగా.. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడంతో మరికొన్ని చోట్ల దెబ్బ తిన్నాయి. దీంతో పశుపోషకులు మూగజీవాల దాహార్తి తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో..

లోకేశ్వరం మండలంలోని 25 పంచాయతీల పరిధిలో 30 గ్రామాలున్నాయి. 2016 నుంచి 2019 వరకు గ్రామానికి రెండు చొప్పున సుమారు 60 వరకు పశువుల నీటితొట్టిలు నిర్మించారు. ధర్మోర, గొడిసెరా గ్రామాల్లో నీటి తొట్టిలు ధ్వంసమయ్యాయి. రాయపూర్‌కాండ్లీలో ఓ నీటి తొట్టి పగుళ్లు బారింది. జోహర్‌పూర్, కన్కపూర్ గ్రామాల్లో నీటి సరఫరా లేక నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి. పంచగుడి, వట్టోలి, జవహర్‌పూర్, అబ్దుల్లాపూర్, గడ్‌చాంద, బామిని(కే) గ్రామాల్లో మాత్రం ఒక్కొక్కటి పని చేస్తున్నాయి.

వినియోగంలోకి తేవాలి..

వేసవి వచ్చినందున దెబ్బతిన్న పశువుల నీటితొట్టిలకు అధికారులు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే చెరువులు, కుంటల్లో నీరు అడుగంటింది. గ్రామాల్లో నిర్మించిన తొట్టిలు నిరుపయోగంగా వదిలేయడంతో ప్రజాధనం వృథా అవుతుందని పశుపోషకులు పేర్కొంటున్నారు.

చెరువుల్లో నీరు తాగిస్తున్నాం



గ్రామంలో నిర్మించిన పశువుల నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి. దీంతో పశువులను దూరంలో ఉన్న చెరువు వద్దకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నాం. ఎండలు తీవ్రమైతే నీటి కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. నీటితొట్టిలను వినియోగంలోకి తేవాలి. –సాయన్న, పశువులకాపరి, రాయపూర్‌కాండ్లీ

పగుళ్లు తేలాయి



గ్రామంలో నిర్మించిన పశువుల తొట్టి పగుళ్లు తేలడంతో నీరు నిలువడం లేదు. నీటిని తాగేందుకు మూగజీవాలు అవస్థలు పడుతున్నాయి. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకొస్తే పశుపోషకులకు మేలు జరుగుతుంది. – చిన్నారెడ్డి, ధర్మోర

వినియోగంలోకి తీసుకొస్తాం

మండలంలోని అన్ని గ్రామాల్లో పశువుల నీటి తొట్టిలను పరిశీలిస్తాం. దెబ్బతిన్న వాటికి మరమ్మతులు చేయించి నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తీసుకొస్తాం. – జగన్నాథ్, ఏపీవో, లోకేశ్వరం

గ్రామాల్లో భూ సమస్యలపై స్పెషల్ డ్రైవ్

లోకేశ్వరం: భూసమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని తహసీల్దార్ మోతీరాం అన్నారు.శుక్రవారం మండలంలోని వట్టోలి, వాస్తాపూర్, పంచగుడి, ధర్మోర గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. గతంలో ధరణి భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వారి సమస్యలు తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ గతంలో దరఖాస్తు చేసుకున్న 305 మంది వివరాలను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బాలకిషన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



వట్టోలిలో పరిశీలిస్తున్న తహసీల్దార్ మోతీరాం

ముధోల్: మండలంలోని రాంటెక్, బోరిగాం, ఆష్టా గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తహసీల్దార్ విఠల్ తెలిపారు. గ్రామాల్లోని భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కుంటాల: మండలంలోని కుంటాల, అంబకంటి, దౌనెల్లి గ్రామాల్లో ధరణి సమస్యలపై రైతుల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. డీటీ నరేశ్ గౌడ్, ఆర్‌ఐ అడెల్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఖానాపూర్ మండలంలో..

ఖానాపూర్: మండలంలోని గ్రామాల్లో ధరణి సమస్యల పరిష్కారానికి శనివారం నుంచి ఈనెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తహసీల్దార్ మామిడి శివరాజ్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పూర్తి వివరాలకు రెవెన్యూ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

పారిశుధ్య కార్మికుల ధర్నా

కుభీర్: తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని శుక్రవారం మండల కేంద్రంలో పని చేస్తున్న 12 మంది పారిశుధ్య కార్మికులు పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఒక్కొక్కరికి నెలకు రూ.9500 రావాల్సి ఉందని.. మూడు నెలలుగా వేతనాలు రాక కుటుంబపోషణకు ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై ఈవో విజయ్‌ని ప్రశ్నించగా ఎస్‌టీవోకు పంపిన వేతనాల బిల్లు సోమవారం పాస్ అవుతుందని.. ఆ తర్వాత కార్మికులకు వేతనాలు చెల్లిస్తామని తెలిపారు.



కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న కార్మికులు

గుండెపోటుతో లైన్‌మెన్ మృతి

నిర్మల్‌టౌన్: లక్ష్మణచాందలో మిషన్ భగీరథ లైన్‌మెన్‌గా పని చేస్తున్న పొట్ట రాజేశ్వర్ (54) గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని మంజులాపూర్ అంబేద్కర్ కాలనీలో నివాసం ఉండే రాజేశ్వర్ విధులు ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. ఇంటి సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్దకు రాగానే గుండెపోటుతో కిందపడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రాజేశ్వర్ భార్య మూడు నెలల కిందట మృతి చెందింది. ఇతడికి కుమారుడు రాజు ఉన్నాడు. తల్లిదండ్రులను కోల్పోయి రాజు రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచివేసింది.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

మామడ: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పరిమండల్ ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.13.50లక్షలతో నిర్మించే ప్రయోగశాల గదికి శంకుస్థాపన చేశారు. ఏడు, ఎనిమిది తరగతుల్లో బెంచీల్లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని.. మరుగుదొడ్లు సరిపోవడం లేదని పోషకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వచ్చే విద్యాసంవత్సరంలోగా పాఠశాలలోని సమస్యలను పరిష్కరిస్తానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, ఎంఈఓ ముత్యం, పీఆర్ డీఈ గంగాధర్‌గౌడ్, ఏఈ అంజనేయకుమార్, రాజారెడ్డి, ధర్మన్న, హెచ్‌ఎం మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆశవర్కర్లకు జీతాలు అందించాలి'

కడెం: ఆశవర్కర్లకు ఫిబ్రవరి నెల జీతాలను అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మిక కనీస వేతన చట్టాలను అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, అనసూర్య, జ్యోతి, దేవిక, మంజుల, సుజాత ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

'అధిష్టానం నిర్ణయానికే కట్టుబడతాం'

లక్ష్మణచాంద: అధిష్టానం ఎంపీ టికెట్ ఎవరికీ ఇచ్చినా కట్టుబడి అభ్యర్థి గెలుపునకు పని చేస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. అట్ల రాంరెడ్డి, ఈటెల శ్రీనివాస్, రమేశ్, నాగేశ్, లింగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రవి, రమణ, శ్రీనివాస్, రాజేశ్వర్, నర్సయ్య, సురేశ్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సీఐను కలిసిన కౌన్సిలర్లు

నిర్మల్‌టౌన్: పట్టణ నూతన సీఐ అనిల్‌ను బీఆర్‌ఎస్ నాయకులు, పలువురు కౌన్సిలర్లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అన్ని పార్టీల నాయకులు కార్యకర్తలు సహకరించాలని సూచించారు. కౌన్సిలర్లు మేడారం అపర్ణ–ప్రదీప్, నల్లూరి పోశెట్టి, అడప పోశెట్టి ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తానూరు: మండలంలోని బోల్సాలో ఉపాధిహామీ నిధులు రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం వైస్ ఎంపీపీ చంద్రకాంత్ ప్రారంభించారు. చందులాల్, కోఆప్షన్ మాజీ సభ్యుడు చంద్రకాంత్, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని ధర్మోరలో శుక్రవారం ఉపాధి నిధులు రూ.నాలుగు లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ మామిడి నారాయణ్‌రెడ్డి ప్రారంభించారు. అసీబొద్దీన్ పటేల్, సాయన్న, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, భూమన్న, ఖైరొద్దీన్, చిన్నన్న, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

కుంటాల: మండలంలోని దౌనెల్లి గ్రామంలో ఉపాధి నిధులు రూ.4లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ గజ్జారాం యాదవ్ భూమి పూజ చేశారు. ఎస్‌కే.గౌస్, ప్రత్యేకాధికారి ప్రకాశ్, ఎంపీటీసీ సుధాకర్, మాజీ సర్పంచ్ ఎండీ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో శుక్రవారం ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు అబ్బురపరిచాయి. జంతువుల ఊపిరితిత్తుల పనితీరు, గ్రహాల గమనం, కోతులు, వన్యప్రాణులతో పంటలకు నష్టం రాకుండా చూసే పద్ధతి, రాకెట్ దూసుకెళ్లే విధానం తోపాటు పలు అంశాల్లో 50 వర్కింగ్ మోడల్స్‌ను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నరేందర్, శంకర్, శేఖర్, శ్రీనివాస్, అంజయ్య, స్వప్న, గంగాధర్, రమేశ్, మారుతి, అఖిల తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి అమలుపై సమీక్ష

దస్తురాబాద్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం గృహజ్యోతి అమలుపై ఏడీఈ కె.శ్రీనివాస్ సమీక్ష నిర్వహించారు. మండలంలో ఇప్పటికే 93 శాతం వినియోగదారులు గృహజ్యోతికి దరఖాస్తు చేసుకున్నారని ఆయన అన్నారు. సబ్‌ఇంజినీర్ నాగరాజు, సిబ్బంది ప్రేమ్, రాజు, శ్రీనివాస్, నాజీర్, జగన్ తదితరులు ఉన్నారు.

వసతులు కల్పించాలని వినతి

ఖానాపూర్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని గోదావరి తీరం వద్ద భక్తులకు వసతులు కల్పించాలని పలువురు కౌన్సిలర్లు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, తొంటి శ్రీనివాస్, పరిమి సురేశ్, నాయిని సంతోష్, జన్నారపు శంకర్, కిశోర్ తదితరులు ఉన్నారు. రంజాన్ మాసం పురస్కరించుకుని ముస్లిం, మైనార్టీలు ఉండే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని నాయకులు అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా కోరారు. చైర్మన్ చిన్నం సత్యం, కమిషనర్ మనోహర్‌లకు వినతిపత్రాన్ని అందజేశారు.

కూరగాయల సాగు పరిశీలన

ఖానాపూర్: రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటలను శుక్రవారం సొసైటీ సభ్యులు పరిశీలించారు. బావాపూర్(ఆర్), సింగాపూర్, పాతతర్లపాడ్, అడవిసారంగాపూర్, సత్తనపల్లి, పాతఎల్లాపూర్, బీర్నంది, ఎర్వచింతల్, కొలాంగూడ, దేవునిగూడెం, ఎక్బాల్‌పూర్ గ్రామాల్లో రైతులకు జూన్, జులై మాసాల్లో అవగాహన కల్పించి గ్రామాభివృద్ధి ఫోరం సభ్యుల ద్వారా కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. చిన్నయ్య, శారద, మమత, లక్ష్మి, అశోక్, దేవిదాస్, తదితరులు ఉన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని పీచర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఫిబ్రవరిలో మొత్తం 23 రోజులు పాఠశాలకు హాజరైన విద్యార్థులను శుక్రవారం ప్రధానోపాధ్యాయులు వింధ్యారాణి, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం వారికి పెన్నులు అందజేశారు. ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, హంసలత ఉన్నారు.

పూలు, పండ్ల మొక్కలు పెంచండి

సోన్: నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలు పెంచాలని మండల ప్రత్యేకాధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాకెర గ్రామంలో సంపదవనం, నర్సరీని ఎంపీడీవో సురేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ మంజులరెడ్డి, కార్యదర్శి ప్రియాంకరెడ్డి, ఎఫ్ఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీ పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ గోవింద్

గొడ్సర పాఠశాలలో వైద్యశిబిరం

కుభీర్: మండలంలోని గొడ్సర ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యులు విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఎక్కువ మంది విద్యార్థులు చర్మవ్యాధులు, గవదబిల్లల బారిన పడటంతో ప్రదానోపాధ్యాయులు సొప్పరివార్ శంకర్ వైద్యులను సంప్రదించి పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటు చేయించారు. గ్రామస్తులూ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు కాశీనాథ్, ముత్యం రెడ్డి, విజయానంద్, నాగేష్, కుమార్, భోజరాం ఉపాధ్యాయుడు నాగోరావ్ తదితరులు ఉన్నారు.



పిల్లలను పరీక్షిస్తున్న వైద్యులు

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

నర్సాపూర్(జి): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లమాడ రైతువేదికలో శుక్రవారం ఆయా గ్రామాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధి నిధులు రూ.12 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శించగా.. జీవశాస్త్రం, సాంఘీకశాస్త్రం బోధించే ఉపాధ్యాయులను నియమించాలని ఎమ్మెల్యేను కోరారు. అంతకుముందు గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు చేశారు. కుంటాల ఎంపీపీ గజ్జారాం, నర్సాపూర్(జి) వైస్ ఎంపీపీ ఎం.లక్ష్మి, నాయకులు వెంగల్‌రావు, మహేశ్, వినోద్‌రెడ్డి, విజయ్‌కుమార్, సత్యం, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ పుష్పలత, ఎంపీఓ శ్రీనివాస్, పీఆర్ ఏఈ సూర్యతేజ, ఆర్‌ఐలు వేణుగోపాల్, సుమలత తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ప్రధాని సభను విజయవంతం చేయాలి

భైంసాటౌన్: ఆదిలాబాద్‌లో ఈనెల 4న ప్రధాని మోదీ పాల్గొనే బహిరంగ సభను విజయవంతం చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావుపటేల్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం భైంసా పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్, ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పట్టణాధ్యక్షులు మల్లేశ్వర్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, భీంరావు, శ్రీనివాస్, రవి, పోశెట్టి, దత్తాత్రి తదితరులున్నారు.

భైంసాటౌన్: బీజేపీ భైంసా మండల మహిళా మోర్చా అధ్యక్షురాలిగా దేగాం గ్రామానికి చెందిన సుష్మను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఎస్ఎస్ కాటన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే రామారావుపటేల్ సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహిళా మోర్చా మండలాధ్యక్షురాలిగా సుష్మను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

4న ప్రధాని సభకు తరలిరావాలి

కుభీర్: ఆదిలాబాద్‌లో ఈనెల 4న జరిగే ప్రధాని సభకు కార్యకర్తలు తరలిరావాలని బీజేపీ మండలాధ్యక్షుడు ఏశాల దత్తాత్రి అన్నారు. శుక్రవారం కుభీర్‌లో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపెల్లి గంగాధర్ దిశానిర్దేశం చేశారు. సభకు జన సమీకరణ, వాహనాల ఏర్పాట్లపై చర్చించారు. గంగాశేఖర్, లింబాద్రి, గణపతి, మ్యాకల రాజు, బంటి తదితరులు ఉన్నారు.

కుంటాల: మోదీ సభను విజయవంతం చేయాలని ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, బీజేపీ మండల కన్వీనర్ గుద్దేటి నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం సభకు సంబంధించి కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

తానూరు: ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ ముధోల్ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, తానూరు మండల అధ్యక్షులు యాతలం చిన్నారెడ్డి కోరారు. శుక్రవారం తానూరులో పార్టీ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. రమేశ్, గాలి రవి, దిలీప్‌కుమార్, రాజశేఖర్, రాజ్‌కుమార్, శివాజీపటేల్, సోమ్‌నాథ్, దేవిదాస్, శేషరావు, సంతోష్ పాల్గొన్నారు.

ముధోల్: ప్రధాని సభ విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న అన్నారు. శుక్రవారం పార్టీ కార్యకర్తలతో ముధోల్‌లో మాట్లాడారు. కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ముత్యం రెడ్డి, మండల ఇన్‌చార్జి తాటివార్ రమేశ్, పోతన్న, ప్రవీణ్‌రావుదేశయ్, దశరథ్, నర్సారెడ్డి, విజయ, నర్సింగ్‌రావు, మహేందర్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: ప్రజలు ప్రధాని సభకు తరలిరావాలని బీజేపీ జిల్లా కార్యదర్శి మెడిసమ్మె రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలాధ్యక్షులు గోవర్ధన్, అడ్వాల రమేశ్, చందురెడ్డి, రాజు, లింగం, స్వప్న పాల్గొన్నారు.

లోకేశ్వరం: ప్రధాని సభకు బస్సులు ఏర్పాటు చేశామని.. కార్యకర్తలు తరలిరావాలని ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బీజేపీ భవనంలో మండల నాయకుల సమావేశం నిర్వహించారు. జయసాగర్ రావు, సాయినాథ్, మహేందర్‌రెడ్డి, పృథ్వీరాజ్, సంతోష్‌గౌడ్, సురేందర్ ఉన్నారు.

కడ్తాల్‌లో బోనమెత్తిన మహిళలు

సోన్: మండలంలోని కడ్తాల్ గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహావిష్కరణలో భాగంగా శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు కొత్త కుండలో వండిన నైవేద్యం బోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి పోచమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా ఆడపడుచులకు పుట్టింటి కానుకలు అందజేశారు. కుచలపూర్ దేవర మల్లయ్యస్వామి భక్తులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.



ఆలయానికి వెళ్తున్న భక్తులు

ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాలి

ఖానాపూర్: డీ–27 కాలువ పరిధిలోని ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం ఖానాపూర్, కడెం మండలాల పరిధిలోని కాలువ వెంట పరిశీలించారు. కెనాల్ పరిధిలో పని చేసే అధికారులు కాల్వ సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. స్థానిక అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా రైతుల పంటలకు సాగు నీరు అందడం లేదని వాపోయారు. దీనిపై కలెక్టర్ స్పందించి కాలువ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. లేకపోతే రైతు సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పీటర్, గంగారాం, శ్రీనివాస్, బక్కన్న, చంద్రయ్య, ఎల్లయ్య ఉన్నారు.

పిచికారీ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీలో పారిశుధ్య కార్మికులు డ్రెయినేజీల్లో పూడిక తొలగించి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేకాధికారి గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్ గ్రామస్తులకు సూచించారు.